కథా నిలయం
1090
శ్రీకాకుళం

# ఉషోదయం

చుట్టూ చీకటి. చెట్లు జడలు విప్పుకున్న భూతాల్లా అగుపిస్తున్నయ్. అయినా, భయపళ్లేదు నీలకంఠం. ఆ చెట్ల మధ్య నుంచే నడుస్తున్నాడు. నిజానికి చీకటి అంటే అతనికి వల్లమాలిన భయం, అయితేనేం, ఈ సమయంలో మాత్రం భయపళ్లేదు. నడుస్తూనే ఉన్నాడు. రైల్వే స్టేషను దగ్గర పడుతోంది. ప్రస్తుతానికి అదే అతని గమ్యం. వడివడిగా అడుగులు వేస్తున్నాడు.

కొద్దిసేపట్లో స్టేషను చేరుకున్నాడు నీలకంఠం. అది చిన్న రైల్వే స్టేషను. ప్లాట్‌ఫారమ్ మీద మనుష లెవ్వరూ లేరు. నిర్మానుష్యంగా ఉంది. కాస్తంత దూరంలో ఎక్కడో కుక్కలు అరుస్తున్నాయ్. స్టేషన్లోని గోడ గడియారం రెండు గంటలు కొట్టింది.

అసిస్టెంట్ స్టేషను మాస్టరు ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. అతనికి కాస్తంత దూరంలో పోర్టరు బీడి కాల్చుకుంటూ కూచున్నాడు. వస్తోన్న నిద్రని బలవంతంగా ఆపుకుంటున్నట్టున్నాడు.

"మేస్టారూ! ఇప్పుడు ఏదేనా బండి ఉందాండీ?" అడిగాడు నీలకంఠం.

"ఎటు కేసి పోవడాని కండీ! మద్రాసు వేపా? లేక కలకత్తా వేపా?" ఎదురు ప్రశ్న వేశాడు అసిస్టెంటు స్టేషను మాస్టరు శ్రీనివాస్.

నీలకంఠం ఆలోచనల్లో పడ్డాడు. ఔను. ఎటు వెళ్ళడానికి? అసలు ఎక్కడికి వెళ్ళడానికి తను నిశ్చయించుకున్నాడని? తనలో తానే ప్రశ్నించుకున్నాడు. ఔను! తనకి ఒక గమ్యం అంటూ లేదు. ఎక్కడికో ఓ చోటుకి పోవాలి. అదే తన ధ్యేయం. అతనిలోని ఆవేశం ఆ నిర్ణయం తీసుకుంది.

"ఎటైనా సరేనండీ" అనేశాడు.

శ్రీనివాస్ ఆశ్చర్యపోయాడు. ఆ జవాబు విని. ఆయన పరిస్థితిని అర్థం చేసుకోగలిగాడు. ఏదో క్షణికావేశం కారణంగా ఆయన విరక్తిని పెంచుకుని ఇంట్లోంచి వచ్చేసి ఉంటాడని భావించాడు. ఆ వయస్సులోనే వాళ్ళకి ఆత్మాభిమానం అధికంగా ఉంటుందని అతనికి తెలుసు.

"ఇప్పుడు ఏ బండీ లేదు గాని, లోపలికి రండి సార్!" అన్నాడు శ్రీనివాస్.

నీలకంఠం నిరుత్సాహంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

"ఎన్నింటికి ఉందంటారు?" మళ్ళీ ప్రశ్నించాడు.

"చెబుతాను గాని, మీరు రండి లోపలికి...." అంటూ చదువుతున్న పుస్తకాన్ని పక్కన బెట్టి ఆహ్వానించాడు శ్రీనివాస్.

నీలకంఠం తప్పనిసరిగా లోపలికి వెళ్లాడు.

"కూచోండి...." ఆసనం చూపిస్తూ, ఆప్యాయంగా అన్నాడు శ్రీనివాస్.

నీలకంఠం అతని ఆప్యాయతకి ముగ్ధుడయ్యాడు. అక్కడే ఉన్న కుర్చీలో కూలబడుతూ "థాంక్సండీ" అన్నాడు.

"టీ తీసుకుంటారా? ఫ్లాస్కులో ఉంది."

"ఈ వేళప్పుడు టీ ఏమిటి బాబూ? అయినా నేను టీ. కాఫీ తీసుకోను బాబూ! మీ ఆప్యాయతకి ధన్యవాదాలు. ఇంతకీ బండి ఎన్నింటికి ఉందో చెప్పారు కాదు" మళ్ళీ అడిగాడు నీలకంఠం.

ఆ ఆత్రుతకి శ్రీనివాస్ అచ్చెరు వందలేదు. సన్నగా మందహాసం చేశాడు.

"ఇది చిన్న స్టేషను కదండీ, ఇక్కడ కేవలం పాసింజరు బళ్ళే ఆగుతాయి. మెయిలు, ఎక్స్‌ప్రెస్సు లేవీ ఆగవండి. అంచేత ఉదయం ఆరింటి వరకూ పాసింజ రేదీ లేదండి. ఔనూ, ఇంతకీ మీరు ఎక్కడికి వెళ్లాలనుకుంటున్నారు?"

ఆ ప్రశ్నకి నీలకంఠం చప్పున జవాబు చెప్పలేక తడబడ్డాడు.

"ఒక నిర్దిష్టమైన గమ్యం లేదు బాబూ! ఎక్కడికైనా ఒక్కటే! ఏదో ఓ పెద్ద ఊరికి వెళ్ళిపోవాలను కుంటున్నాను," మొహం దించుకునే అన్నాడు.

"మీ ఊరు విడిచిపెట్టాలి. మీ ఇల్లు విడిచిపెట్టాలి. అదే మీ ప్రస్తుత నిర్ణయం. అంతేనాండీ?" అతని మొహంలోకి చూస్తూ అన్నాడు శ్రీనివాస్.

"ఔను బాబూ!"

"ఇంట్లో మీ కుటుంబ సభ్యుల నిరాదరణకి గురవుతున్నారు. దాన్ని మీరు తట్టుకోలేకనే ఈ పలాయనం....ఔనా?" అన్నాడు శ్రీనివాస్.

నీలకంఠం విస్తుపోయాడు. తమ ఇంటి విషయాలు ఈ అసిస్టెంటు స్టేషను మాస్టరుకి ఎట్లా తెలుసు – అనుకున్నాడు లోలోన.

"నీకు... నీ కెలా తెలుసు బాబూ, మా ఇంటి విషయాలు?" శ్రీనివాస్ కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు నీలకంఠం.

శ్రీనివాస్ సన్నని మందహాసం చేశాడు. ఆ ప్రశ్న ఆయన వేస్తాడని ముందే ఊహించాడు కూడాను.

"ఈ రోజుల్లో సర్వసాధారణంగా మీ వయస్సులోని వ్యక్తులు ఎదుర్కొంటున్న సమస్యే ఇది. సర్వత్రా కాకపోయినా అక్కడక్కడా జరుగుతున్నదే ఇది. అందుకే, ఊహించి చెప్పాను. ఎవరు ఏమన్నా సరే, దానికి విపరీత భాష్యం ఊహించుకుని మీలో ఓ విధమైన న్యూనతా భావం, ఓ తరహా అలసత్వం చోటు చేసుకుంటున్నాయి. దానికి కారణం కేవలం

మిమ్మల్ని మీరు కించపర్చుకోవడమే నంటాన్నేను. మీలో ఉండాల్సిన హుందాతనం, గాంభీర్యం క్రమంగా అంతరించిపోతున్నాయి. మీరు రిటై రయినంత మాత్రాన మీ ఇంట్లో వాళ్లు మిమ్మల్ని చిన్న చూపు చూస్తారా? అలా అని నేను అనుకోనండి. అయితే, ఆ విధంగా మీరు ఆలోచించరు. వాళ్లు మిమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారనే భావనే మీది" అంటూ ఆగాడు శ్రీనివాస్.

నీలకంఠం ఏమీ అనలేకపోయాడు. బహుశా అతడు చెప్పింది నిజమేనేమో ననిపించింది. అటువంటి భావనే తను పలాయన మవ్వడానికి ప్రోత్సహించింది. అయితే, అతను చెప్పినట్టు తా నొక్కడే అందుకు బాధ్యుడు కాదు. అలా అని బాహ్యంగా వ్యక్తం చెయ్యలేక పోయాడు. నీలకంఠం మౌనంగా ఉండిపోవడం, శ్రీనివాస్ ఆలోచనలకి మరింత బలా న్నిచ్చింది.

"ఇప్పుడు చెప్పండి, సార్! మీరీ నిర్ణయాన్ని తీసుకోడానికి బలీయ మైన కారణం ఉందంటారా?" ప్రశ్నించాడు శ్రీనివాస్.

ఏం చెప్పాలో నీలకంఠానికి తోచలేదు. మళ్ళీ మౌనమే శరణ్యా మయ్యింది.

అయితే, పట్టు విడవని విక్రమార్కుడిలా శ్రీనివాస్ కూడా వదిలి పెట్టలేదు. "సందేహించకండి.... చెప్పండి, సార్.... నేను మీ కొడుకు లాంటివాణ్ణి చెప్పండి."

"ప్రత్యేకించి కారణం ఏమీ లేదు బాబూ! కాని, నువ్వూహించినట్టు ఇంట్లో వాళ్ళందరూ నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారేమో నన్న భావన నాలో బాగా నాటుకుపోయింది. అన్ని వేళలా నాకు చేదోడు వాదోడుగా ఉండా ల్సిన నా అర్ధాంగి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం నన్ను మరింత క్రుంగదీసింది. వాళ్ళందరి ప్రవర్తనను జీర్ణించుకోలేక ఇలా పిరికివాడిలా పలాయన ప్రయత్నం చేశాను." నీరసంగా చెప్పుకుపోయాడు నీలకంఠం.

శ్రీనివాస్ ముసి ముసిగా నవ్వుకున్నాడు. తానూహించింది నిజమై నందుకు.

"మీ వ్యథని నేను అర్థం చేసుకోగలిగానండీ! నేను సరిగ్గానే ఊహించా నన్నమాట! నిజానికి ఈ పరిస్థితికి ఎవ్వరూ బాధ్యులు కారేమో

ననిపిస్తుందండి. ఎవరి పనుల్లో వారుంటారు. ఎవరి బాధ్యతలు వారికుంటాయి. ప్రత్యేకించి మీ సేవలే చేస్తూ, మీగురించే ఆలోచిస్తూ ఉండటం ఈ వయసులో మీ భార్యకి సాధ్యపడదేమో, ఒక్కసారి ఆలోచించండి. ఇంట్లో ఆమెకి ఇంకెన్నో పను లుంటాయి. కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు, మనుమలు, ఇంకా బంధువులు-ఇలా ఎవరో ఉంటూనే ఉంటారు. ఆమెకి తీరికెక్కడిది చెప్పండి? అయితే, ఆమె బాధ్యతల్ని మీలో నాటుకుపోయిన న్యూనతా భావం గుర్తించడం లేదు. అదే మీ బలహీనత. అదో విధమైన అపోహ! అంతేగాని, నిజానికి ఎవ్వరూ మిమ్మల్ని చిన్న చూపు చూడరు. ఇలా అంటున్నానని మీరు అపార్థం చేసుకోకపోతే ఒక్క విషయం చెప్పాలి. ఈ వయసులో మీ కో అవగాహన, సర్దుబాటు మనస్తత్వం అవసరమండీ! ఇది నా సలహా కాదు - నా అభ్యర్థన మాత్రమే! మనం అపరిచితులమే అయినా చొరవ తీసుకుని చెప్పాను. స్టేషన్లలో ఇటువంటి సంఘటనల్ని ఎన్నో చూస్తుంటాం. ఆ అనుభవం మీదే చెబుతున్నాను. అలాగని అందరూ మంచివాళ్ళే ఉంటారని నేనూ అనను. రాచి రంపాన పెట్టే ఏ కొద్దిమందో భార్యలు. కోడళ్ళూ లేకపోలేదు. అయితే, మీ విషయంలో అటువంటి పరిస్థితి లేదనుకుంటాను."

నీలకంఠం గొంతులో పచ్చివెలక్కాయ పడింది. ఏం చెబుతాడు? కొద్ది మంది బాధితుల్లో తానూ ఒకడని చెప్పడం అతనికి ఇష్టం లేకపోయింది.

"అబ్బే! అటువంటి పరిస్థితి నాది కాదు బాబూ!" అనేశాడు.

"మీరైతే ఇలా వచ్చేశారు. అదృష్టవశాత్తూ ఏ బండీ లేదు గాబట్టి ఇంతవరకూ ఇక్కడే ఉండిపోయారు. కాని, మీ ఇంట్లో మీభార్య, పిల్లలు మీరు అగుపించక పోయేసరికి ఎంత కంగారు పడిపోతున్నారో, ఎంతగా ఆందోళన చెందుతున్నారో ఆలోచించారా?"

నీలకంఠం మొహం కళావిహీన మయ్యింది.

"ఔను బాబూ! నువ్వన్నది నిజమే! ఇంట్లోవాళ్ళు ఎంతగా ఆందోళన చెందుతున్నారో? నేను వెళ్ళిపోవా లనుకున్నాను గాని, ఎక్కడికి వెళ్తానో అదీ నిశ్చయించుకోలేదు. క్షణికమైన ఆవేశంతో ఏ నిర్ణయమూ తీసుకోకుండానే ఇంట్లోంచి బయటపడ్డాను. దేవుడిలా నువ్వు తారస

పడ్డావు. తారసపడినా ఏవీ పట్టనట్టు ఊరుకోకుండా నా పరిస్థితిని ఊహించి, నాలోని క్షణికమైన ఆవేశాన్ని ఎత్తి చూపావు. దాన్ని చల్లార్చ డానికి ప్రయత్నించావు. అంతే కాదు, నా అదృష్టం బావుండి ఈ సమ యంలో పాసింజరు బండి ఏదీలేదు. లేకుంటే నా ప్రయాణం ఎక్కడికో, గమ్యం ఏమిటో అర్థం కాని స్థితిలో ఎక్కడో దిగిపోయి, ఊరు కాని ఊళ్లో నేనెన్ని ఇబ్బందులు పడేవాణ్ణో?" అంటూ చెప్పుకుపోతూ ఉంటే, ఆయన గొంతు పూడుకుపోయి నట్టయ్యింది. అతనిలో పశ్చాత్తాపం వెల్లువలా పొంగి ప్రవహించింది.

నీలకంఠంలో మార్పు వచ్చినందుకు శ్రీనివాస్ తృప్తిగా నవ్వు కున్నాడు. అటువంటి మార్పే అతను ఆశించింది!

"క్షణికమైన ఆవేశంలో అనాలోచితంగా మీరు ఇల్లు వదిలేయ డానికి సంసిద్ధులైనా, మీ తొందరపాటుని గుర్తించి ఇప్పుడు మీరు పశ్చా త్తాపపడుతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉందండి. చిన్నవాణ్ణి అయినా నా మాటలకు మీరిలా స్పందించి మారినందుకు మీకు ధన్యవాదాలు చెప్పు కుంటున్నాను. ఇక ఇంటికి వెళ్ళండి, సార్! తెల్లవారుతోంది." అన్నాడు శ్రీనివాస్. ఎంతో ఉత్సాహంగా అతని హృదయం ఉప్పొంగిపోతోంది.

"నిజమే బాబూ! నాలోని చీకట్లు తొలగిపోయి ఉషోదయ మయ్యింది" అన్నాడు నీలకంఠం.

సరిగ్గా అప్పుడే నీలకంఠం కొడుకు నారాయణరావు, మరో ఇద్దరు వ్యక్తులతో అక్కడికి వచ్చాడు. తండ్రిని చూడగానే అతనికి ఎక్కడలేని ఆనందమూ పెల్లుబికింది. తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. తండ్రికి దగ్గరగా వెళ్లాడు. "నాన్నా మీరు ఇంట్లో అగుపించకపోయేసరికి మేమం దరమూ ఎంతగా ఆందోళన చెందామో మీకు తెలీదు. అమ్మ నెత్తీ నోరూ కొట్టుకుని విలపిస్తోంది. ఇంతకీ మీ రెందుకిలా చేశారు చెప్పండి? చేతిలో ఆ సంచీ ఏమిటి? ఎక్కడికి వెళ్ళిపోవాలని ఈ ప్రయత్నం? అమ్మగాని, నేను గాని, కోడలు గాని ఎవ్వరైనా మీ మనసుకి కష్టం కలిగించారా? మీ అభీష్టానికి భిన్నంగా మాలో ఎవ్వరయినా ప్రవర్తించామా? మీలో ఎందుకీ ఆలోచన కలిగింది? చెప్పండి నాన్నా!" రుద్ధ స్వరంతో అన్నాడు నారాయణరావు.

నీలకంఠం జవాబు చెప్పలేదు. మొహం దించేసుకున్నాడు.

నారాయణరావు మళ్ళీ ప్రారంభించాడు- "పట్నం కాలేజీలో నాకు లెక్చరర్ పోస్టు వచ్చినా మీరు వద్దన్నారని మానేసి మన ఊళ్ళోనే హైస్కూలు ఉపాధ్యాయుడుగానే ఉండిపోయానే? అది మీ కోసం కాదూ? నాకు తెలీకుండా ఇంకేమయినా తప్పులు చేశానా? చెప్పండి నాన్నా!" అన్నాడు.

నీలకంఠం ఏమని సమాధానం చెబుతాడు? ఒక్కొక్కప్పుడు కొడుకు ఆవేశాన్ని పట్టలేక తనని చీత్కరించుకుంటున్నాడని, అక్కడ ఎలా చెబుతాడు? ఒకవేళ చెప్పినా తనకే సహనం లోపించిందని విన్న వాళ్ళు తననే నిందిస్తారని ఊహించాడు. అందుకే ఉన్నది ఉన్నట్టు చెప్ప కూడ దనుకున్నాడు. పాలిపోయిన అతని పెదాలపై సన్నని మందహాసం వెలిసింది.

"అబ్బే! అటువంటి దేమీ లేదురా అబ్బాయ్...." అన్నాడు నీలకంఠం.

"పోనీ, మీ కోడలు ఏమైనా నోరు జారిందా?"

"అబ్బెబ్బే! ఆమె నెందుకురా నిందించడం?" అని అనేశాడే గాని, 'నువ్వు దగ్గరుండగానే ఆమె నన్ను అవమానపర్చినప్పుడు నువ్వేమీ పట్టించుకోలేదేంరా?' అని అడగలేకపోయాడు. అది అతని సత్సంస్కృతికి నిదర్శనం. అలా చెప్పి తన కుటుంబాన్ని రచ్చకెక్కించడం నీలకంఠానికి ఇష్టం లేకపోయింది. అందుకే ఆ విధంగా దాటవేశాడు.

"అయితే, ఇంకెవరు, నాన్నా? అమ్మే మిగిలింది. అమ్మగాని మీ మనస్సును నొప్పించిందా?" అడిగాడు నారాయణరావు.

శ్రీనివాస్ ముసలాయనకేసి అలాచూస్తున్నాడు. ఆయన మొహంలో ఏవేవో భావాలు అస్పష్టంగా తారాడుతున్నట్టయ్యిందతనికి. తన మనస్సు లోని వ్యథని ఆయన సూటిగా వ్యక్తం చెయ్యలేకపోతున్నాడని శ్రీనివాస్ గ్రహించడానికి అట్టే సమయం పట్టలేదు. ఒక విధంగా చూస్తే అది శ్రేయస్కరమే ననిపించిం దతనికి.

క్షణం మౌనం తర్వాత నీలకంఠం ప్రారంభించాడు.

"భర్తగా ఇన్నేళ్ళ సాహచర్యంతో మీ అమ్మతో ఏర్పడిన

అనుబంధం ఎన్నటికీ విడిపోనిది. వాడనిది. మా ఇరువురి మధ్య ఎటువంటి పొరపచ్చాలు, అపార్థాలు రావడానికి అవకాశమే లేదురా?" అన్నారు. 'మీకు బొత్తిగా ఇంగితం లేదండీ! వయస్సు మీద పడుతున్న కొద్దీ ఆవేశమూ అధిక మైపోతుంది. మీతో వేగలేకపోతున్నాను. ఇన్నేళ్ల ఎలాగో భరించాను. ఇహ నా తరం కాదు...' అంటూ కోడలు సమక్షం లోనే మొన్నను భార్య చీదరించుకోవడాన్ని ఎలా బయట పెట్టగలడు? బయట పెడితే ఆమెతో ఇన్నేళ్ళు గడిపిన సంసార జీవితానికి అర్థమే ఉండదనిపించిం దతనికి. అంతే కాదు - అందరూ నవ్వుతారనిపించింది కూడాను, భార్యా భర్తల మధ్య ఉండే అనుబంధాన్ని కాదు-అపశ్రుతుల్ని తెలియనివ్వకూడదని అతని అభిమతం.

నారాయణరావు ఓ నిట్టూర్పు వదిలాడు. తండ్రి మనస్తత్వం అతనికి అవగతం కాలేదు. "ఎవ్వరూ ఏమీ అనలేదు. మీ మనస్సుని గాయపరిచే సంఘటనే తటస్థపడలేదు. మరైతే మీ ఈ పలాయన ప్రయత్నానికి అర్థం ఏమిటి నాన్నా?" మళ్ళీ అడిగాడు నారాయణరావు.

నారాయణరావు ఊహించలేదు. తండ్రి మనస్సు ఎంతో విశాల మైనదని, అందులో ఎన్నో చీత్కారాలు, అవమానాలూ దాగి ఉన్నాయని!

శ్రీనివాస్ మాత్రం నీలకంఠం మనస్తత్వాన్ని అర్థం చేసుకో గలిగాడు. సలహాలు చెప్పడమైతే చెబుతాం గాని, నిజంగా అనుభవించిన వారి మనస్సులోని తుఫాను ఇంకొకరికి ఎలా తెలుస్తుంది? నీలకంఠం ఏం సమాధానం చెబుతాడు? మౌనంగా ఉన్న అతనికి సహకారాన్ని అందించాడు శ్రీనివాస్.

"ఆయనేం చెబుతారండీ, మానసికంగా అలజడికి గురై ఉన్నారు. ఏదో క్షణికమైన ఆవేశాన్ని అరికట్టలేక అలా ప్రవర్తించారేగాని, నిజానికి ఆయనకు మాత్రం తెలీదటండీ. ఇంకెక్కడయినా ఈపాటి ఆదరణ అయినా లభించదని! ఎవ్వరి మీదా కోపంతో ఈ ప్రయత్నానికి పూనుకో లేదు. అది కేవలం అతనిలో రేకెత్తిన క్షణికావేశ ఫలితమే! ఏమండీ, అంతే కదూ?" అన్నాడు చిరునవ్వుతో శ్రీనివాస్ నీలకంఠం కేసి చూస్తూ.

నీలకంఠానికి ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది. ఏం చెప్పాలా అని

సందిగ్ధంలో పడిన తనకి ఇంత సున్నితమైన సమస్యకి పరిష్కారాన్ని అందించి సహకరించిన శ్రీనివాస్‌ని మనసులోనే అభినందించుకున్నాడు నీలకంఠం.

"ఆఁ....ఆఁ....అంతే బాబూ! ఏదో క్షణికమైన ఆవేశమే మనస్సును అల్లకల్లోలం చేసి నా తొందరపాటుకి కారణమయ్యింది. అంతే, నా ఈ తొందరపాటుకి ఇంకెవ్వరూ బాధ్యులు కారు బాబూ! ఆ బాధ్యత నాదే! తొందరపాటు నాదే!" అంటూ కొడుక్కేసి తిరిగాడు.

"ఒరేయ్ అబ్బాయ్. ఇంటికి పోదాం పద...." అన్నాడు నీలకంఠం.

"పదండి నాన్నా – మా అదృష్టం కొద్దీ మీలో మార్పు వచ్చింది. అదే మాకు ఆనందం. పదండి" అంటూ ఉత్సాహంగా ముందుకు సాగాడు నారాయణరావు.

నీలకంఠం, శ్రీనివాస్ భుజం తట్టి – "వెళ్ళొస్తాను బాబూ! ఎవరో నా కెందుకులే అనుకుని ఊరుకోకుండా నా తొందరపాటుని నాకు గుర్తు చేసినందుకు, నాలో రేగిన క్షణికావేశాన్ని చల్లార్చి, నాలో తాపాన్ని రేకెత్తిచ్చినందుకు నీకు ప్రత్యేకంగా అభివందనలు చెప్పుకుంటున్నాను. మరెప్పుడూ ఇలా జరగదని హామీ ఇస్తున్నాను" అన్నాడు.

శ్రీనివాస్, నీలకంఠం రెండు చేతులూ పట్టుకున్నాడు – "ఆ నమ్మకం నాకుందండీ! మీ విశాల హృదయాన్ని నేను అర్థం చేసుకున్నాను. వెళ్ళి రండి....అప్పుడప్పుడూ వస్తూ ఉండండి. మా ఇల్లు స్టేషను వెనుకే ఉంది," ఆప్యాయంగా అన్నాడు శ్రీనివాస్.

"అలాగే బాబూ! నీ ఆప్యాయతని, ఆత్మీయతని ఎన్నటికీ మరిచి పోలేను. వెళ్ళొస్తాను" అంటూ ముందుకు సాగిపోయాడు నీలకంఠం కొడుకుతో పాటు.

సూర్యుని బంగారు లేత కిరణాలు అప్పుడే ప్రసరించడం ప్రారంభ మయ్యాయి.

వెళ్ళిపోతున్న నీలకంఠాన్ని చూస్తూ తృప్తిగా నవ్వుకున్నాడు శ్రీనివాస్.

* ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఆగస్టు, 1993 *